# అభినవ వడ్డికాసులవాడు

'ఊరు నిదురపోయే, గాలి నిదురపోయే' అన్నట్టు అందరూ నిద్రపోతూ వుండగా, చిన్న చీకటి కొట్లో... ఓహ్! జిగజిగ మెరిసే చిల్లర నాణాలు, రూపాయి బిళ్లలూ, అర్ధరూపాయి బిళ్ళలూ, పావలాలూ, పది పైసలూ, అయిదు పైసలూ, చిన్న చిన్న గుట్టలుగా వున్నాయి. వంద రూపాయల నోట్ల కట్టలూ, యాభై రూపాయల కట్టలూ, ఇరవై రూపాయల కట్టలూ, పదీ, అయిదూ, రెండూ, ఒకటీ. . .! ఇలా వేర్వేరుగా, దేనికవి కట్టి వున్నాయి.

అది తిరుపతి వెంకటేశ్వరుని దేవాలయం కాదు. డబ్బులు హుండీలోవీ కావు. ఆ నగలు ముడుపులు కావు. లెక్క పెడుతున్నది వడ్డీకాసుల వాడి అన్నగారు గోవిందరాజుల స్వామి కాదూ... మరి? కళ్ళు తిరిగిపోతున్నాయి నరసయ్యకి! ఆ రాత్రి ఆ చీకటి కొట్లో ఆ పన్లు చేస్తూన్నది, తన యజమాని సేఠ్ మోహన్ లాల్.

నగదు రూపాయలు అప్పిస్తే నూటికి ఎనిమిది రూపాయల వడ్డీ. బంగారం తాకట్టు పెడితే, రసీదు కావాలని పట్టుబడితే బంగారపు నగలపైన, నూటికి అయిదు రూపాయల వడ్డీ. రశీదు అక్కర్లేదని, నమ్మకంమీద పోతే, నూటికి నాలుగు రూపాయల వడ్డీ. "రశీదెందుకులే నీ బాంచను. ఇంకొక రూపాయి దండగ" అంటు వెళ్లిపోయే పోచయ్యలూ, రాములమ్మలూ వున్నంతకాలం, శేఠ్ మోహన్‌లాల్ తిజోరీలో వస్తువులు నిండుతూనే వుంటాయి. రెండేళ్ళ వరకు గడువు. ఆ తర్వాత ఆ వస్తువులు శేఠ్ జీకే సొంతమవుతాయి! ఈలోగా వీళ్ళు కట్టిన డబ్బులు, వడ్డీకి పిల్లలు పెడుతూ పోతుంది. అసలు ఈ జన్మకి తీరదు.

ఆ నగలలో ఎందరో ఆడవాళ్ళ అశ్రువులున్నాయి! ఉసురులున్నాయి! కడుపు మంటలున్నాయి. మంగళసూత్రాలు తీసి ఇస్తున్నప్పుడు దుఃఖంతో పెట్టిన శాపనార్థాలున్నాయి! అయినా అవి చెక్కు చెదరకుండా శేఠ్ జీ తిజోరీలో హాయిగా వున్నాయి!

అలాగే ఆ రూపాయల కట్టల్లో, కూడులేక కడుపు మాడుతూ వుంటే పట్టుకెళ్లిన అసలు తాలూకు వడ్డీలున్నాయి. చావుబతుకుల్లో వున్న బిడ్డల్ని రక్షించుకోవడానికి తీసుకున్న రొక్కం తాలూకు వడ్డీలున్నాయి. శవదహనానికి కావలసిన డబ్బుకి, పెరిగిన వడ్డీలున్నాయి. కానీ, అన్నీ కలిసి శేఠ్ జీ తిజోరీలో హాయిగా వున్నాయి. భద్రంగా! నరసయ్య ఆలోచిస్తున్నాడు. "ఇంత పైకం, శేఠ్ జీ ఏం జేసుకుంటాడో! ఒక్క పది రూపాయలిమ్మంటే, లేవు పొమ్మంటాడు... నీయవ్వ! ఆయన కొడుకులు, బిడ్డలు, ఏం కష్టం చెయ్యబడదు. కాలుమీద కాలేసుకుని కూకోని తినొచ్చు! మా రాజిగాడు లెక్కనా! ఆడికి ఒక్కోనాడు అన్నంగూడ సరిగ్గుండదు. గంజితాగి ఎల్లిపోతడు! ఎప్పుడు సూడు, ఆ పొస్తకాలనొదలడు, గదేందో మల్ల!" తలపాగాలోంచి పొగాకుతీసి, చుట్ట చుట్టి, చెకుముకి రాయితో వెలిగించి, గట్టిగా దమ్ములాగి తృప్తిగా పొగవొదుల్తూ ఆలోచిస్తున్నాడు నరసయ్య!

నరసయ్య శేఠ్ మోహన్ లాల్ ఇంట్లో నౌకరు! "శేఠ్ జీకి, గదేందో చక్కెర రోగముందట. తీపి తినొద్దట! బెడ్డ్ పెసరుందట! ఉప్పు తినొద్దట! గదేందో... అల్సరుందట! గదేంరోగమో మల్లా కారం తినొద్దంట! నీ యవ్వ... ఉప్పులేదూ, కారం లేదూ, తీపిలేదూ. ఇగేందింటడే! ఏమైన ఆ పైకాన్ని జూసి మురుత్తాండు' ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు నరసయ్య, గంగమ్మ వడ్డించిన చేపల పులుసు, జుర్రుకుంటూ తింటూ.

"అయన్ని గొప్పోల్ల రోగాల్లే! మనకెందుకంట! ఇంకొక ముక్క బెట్టుకో" అంటూ మళ్ళీ వడ్డించింది గంగమ్మ.

శేఠ్ జీ కొడుకు శ్యామ్ లాల్ చదువు మానేశాడు! తిజోరీ డబ్బులు, అతని జేబులు నింపుతున్నాయి! శేఠ్ జీ లబోదిబో మొత్తుకుంటున్నాడు, ఖాళీ అవుతూన్న తిజోరీని చూసి.

"ఎనిమిది వందల యాభై" అంటూ లెక్కబెట్టి డబ్బుల్ని నరసయ్య చేతిలో బెట్టాడు రాజిగాడు కాదు రాజేష్. అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు.

శేఠ్ మోహన్‌లాల్‌ని ఆసుపత్రిలో చేర్పించారు. గుండెపోటుకి! సరిగ్గా ఆ సమయంలోనే అతని ఇంట్లో దొంగలు పడి, తిజోరీని దోచుకున్నారు. భార్య శకుంతల పోలీసు రిపోర్టిచ్చింది. పోలీసులు ఆసుపత్రిలో పడుకున్న మోహన్‌లాల్‌ని అడిగారు, 'మీకెవరి మీదైనా అనుమానం వుందా?' అని! భార్య శకుంతల 'తిజోరీ సంగతి మా ఇంట్లో వాళ్లకీ, మా పనివాడు నరసయ్యకీ తప్ప ఇంకెవ్వరికీ తెలీదు' అంది నరసయ్యను అనుమానిస్తున్నట్టుగా.

ఆ మాటలకి నరసయ్య ఒణికిపోయాడు.

"బాబూ! నాకే పాపం తెలీదు" అంటూ దండం పెట్టాడు.

శేఠ్ జీ నవ్వుతూ "నరసయ్యా! నువ్వు కష్టపడి సంపాదించిన డబ్బుతో నీ కొడుకు ప్రయోజకుడయ్యాడు. నేను కూడబెట్టిన పాపపు మూటతో మావాడు తన ఇంటికి తనే కన్నం వేశాడు. ఇది పాప పుణ్యాల ఫలితమో కాదో నాకు తెలీదు. కానీ, ఒక్కటి మాత్రం తెలుసుకున్నాను. పెంపకంలో లోపం. నీ కొడుకుకి నీ దగ్గర ఏమీ లేదని తెలుసు. వాడు అందుకే ఆ లేని దానికోసం పాటుపడి సాధించాడు. మావాడు చిన్నప్పటినుంచీ తిజోరీని చూసి చూసి ఆకర్షితుడవుతూ వచ్చాడు. ఆ డబ్బంతా తనదే, తనకేమీ లోటు రాదనే భావనతో పెరిగాడు. వాడికి కష్టం తెలీకుండా అడిగినంతా ఇచ్చి పెంచిన తప్పునాదే! పోలీస్ ఇన్‌స్పెక్టర్ సాబ్! ఈ దొంగతనం చేసింది నా కొడుకేనని నాకు తెలుసు. అరెస్టు చెయ్యండి" అన్నాడు.

"ఏమండీ! మీరు తండ్రేనా? ఒకవేళ బిడ్డ తప్పుచేస్తే తల్లిదండ్రులు కడుపులో పెట్టుకుని దాచుకోవాలిగానీ ఇలా బయటపెట్టుకుంటారా?" తల బాదుకుంది శకుంతల.

"ఆ సిద్ధాంతమే సరైనది కాదు శకుంతలా! మన మమకారం వాడిని పెడతోవ పట్టించకూడదు. ఈ శిక్ష వాడిని మనిషిగా మార్చడానికే! ఈ రోజుతో నేను వడ్డీ వ్యాపారం మానేస్తున్నాను అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ! ★